బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

భీమదేవరపల్లి, నవంబర్ 18 : సిద్దిపేట –హనుమకొండ ప్రధాన రహదారిపై గోపాల్‌పూర్ కమాన్ సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర సమ్మయ్య(60) ఆదివారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన సూర సమ్మయ్య బైక్‌పై కొత్తపల్లిలోని అతడి వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్‌కు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సూర సమ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై సంద్రు సాయిబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కమలాపూర్, నవంబర్ 18 : మండలంలోని శనిగరం గ్రామంలో బండి రమేశ్‌కు చెందిన పాడి గేదె కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. రమేశ్ భార్య గేదెను మేపేందుకు తీసుకెళ్తుండగా కరెంటు స్తంభం వద్ద సపోర్టు తీగకు తగలడంతో గేదె మృతిచెందినట్లు చెప్పారు. గేదెను రక్షించబోయిన రమేశ్ భార్యకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందన్నారు.

బాలిక అదృశ్యం

అనూష (ఫైల్)

వేలేరు, నవంబర్ 18 : మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన బాలిక దాసరి అనూష అదృశ్యమైనట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి కుమార్ తన కూతురు అనూష (17)ను ఇంటి వద్ద ఉంచి ఆదివారం ఉదయం అతడి భార్య కోమలతో కలిసి వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారు, బంధువులను అడిగినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు కుమార్ వేలేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 4,170 కోట్లను మంజూరు చేస్తూ జీవో విడుదల చేసినట్లు, త్రినగర వాసుల చిరకాల వాంఛ నెరవేరిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నగరానికి మూడు దశల్లో జరిగే పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచి నీటి సరఫరా వ్యవస్థ, నీటి వనరుల పునరుజ్జీవం, జలాశయ నిర్వహణ ప్రణాళిక, బ్లూ–గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన మొదలైన సేవల కోసం భూగర్భ నాళాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా రాజ్‌కుమార్

ఎల్కతుర్తి, నవంబర్ 18 : ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని పెంచికల్‌పేట గ్రామానికి చెందిన తూముల రాజ్‌కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్కతుర్తి అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగారపు సుమన్ కుమార్ నియామక ఉత్తర్వులను రాజ్‌కుమార్‌కు అందించారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులతో పాటు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాతూరి వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలుమారి బాలస్వామి, సాతూరి కోమలకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కేయూలో మాట్లాడుతున్న చిరంజీవి

28న కేయూలో సదస్సు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : ఈ నెల 28వ తేదీన కామర్స్ అండ్ బిజినెస్ హాల్లో జరిగే ఎంఎస్ఎఫ్ మాదిగ విద్యార్థుల ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి పిలుపునిచ్చారు. సోమవారం కేయూలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణపైన సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా మాదిగలని మోసం చేస్తున్నదన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ముక్కెర ముఖేష్, కేయూ ప్రధాన కార్యదర్శి అరిస్టాటిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED TELECALLERS
jobs Apply Now!
★URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVESJOB LOCATION: HANAMKONDA, CONT: +91 9398286149.
NTW-7705

RENT

★3 floors building for rent, each floor has 3600sqft Ground floor for parking place available, opp:ASM DEGREE & PG WOMENS COLLEGE,Fort Road Warangal
M: 9849987808/8309884828.
NTW-17373

WANTED HOSPITAL STAFF
★Operation Theater Boys, Medical Shop Assts. & Computer Operators/Administrators /Supervisors Required Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm
NTW-450

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కాకతీయ మ్యూజికల్ గార్డెన్ ముఖద్వారం

సిబ్బంది పట్టించుకోక పోవడంతో ఎండిపోతున్న గ్రీనరీ

మూగబోయిన సంగీత ఝరి

- మూడేళ్లుగా మూసివేత
- కాకతీయ మ్యూజికల్ గార్డెన్ తెరుచుకునేది ఎప్పుడో?
- కుడా మార్క్ అభివృద్ధి అంటే ఇదేనా?

వరంగల్, నవంబర్ 18 : చారిత్రక వరంగల్ నగర ప్రజలకు సాయంత్రం వేళ ఆహ్లాదంతో పాటు వీనులవిందు కల్గించే సంగీత ఝరి మూగబోయింది. ప్రతి రోజు సంధ్యా సమయంలో నగరవాసులతో కళ కళలాడే మ్యూజికల్ గార్డెన్ మూతపడి మూడేళ్ల అవుతోంది. రూ.14.50 కోట్లతో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేపట్టిన మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులపై ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగానికి పట్టింపులేదు. ప్రస్తుత జీవనం శైలిలో అలా కాసేపు కుటుంబంతో సేద తీరేందుకు వీలుగా ఉన్న మ్యూజికల్ గార్డెన్ నేడు మూత పడడంతో బోసిపోయి కనిపిస్తోంది. నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే గార్డెన్‌ను పునరుద్ధరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కుడా చేపట్టిన ఏ అభివృద్ధి పనైనా ఇలాగే ఉంటుందన్న అపవాదును మ్యూజికల్ గార్డెన్ పనులు నిజం చేస్తున్నాయి.

నిలిచిపోయిన పనులు..

మ్యూజికల్ గార్డెన్ పనులు నిలిచిపోయాయి. రూ. 14.50 కోట్ల అంచనాలతో చేపట్టిన గార్డెన్ అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కేవలం మ్యూజికల్ గార్డెన్ చుట్టూ ప్రహరీ పనులు పూర్తి చేశారు. గార్డెన్‌లో గ్రీనరీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కనీసం గ్రీనరీ కాపాడే వారు కనిపించడం లేదు. గతంలో గార్డెన్‌లోని కెఫటేరియా షెడ్ శిథిలావస్థలో ఉంది. పిల్లల ఆట వస్తువులకు వేసిన రంగులు వెలిసిపోతున్నాయి. కనీసం రోజు శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడంతో రాలిన ఆకులతో మ్యూజికల్ గార్డెన్ చిట్టడవిని తలపిస్తోంది.

ప్రణాళికలు కాగితాల్లోనే..

మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి ప్రణాళికలు కుడా కాగితాల్లోనే మూలుగుతున్నాయి. మూడేళ్లకుపైగా మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ సాగుతూనే ఉన్నాయి. గార్డెన్‌కు అనుకొని ఉన్న భద్రకాళీ చెరువు అందాలను గార్డెన్‌కు వచ్చే సందర్శకులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్న ప్రణాళికలకు అతీగతి లేదు. కుటుంబాలతో వచ్చే సందర్శకులకు మ్యూజికల్ గార్డెన్‌లో లేక్ వ్యూ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలకు బ్రేక్‌లు వేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు ఆర్కిటెక్టులు క్షేత్రస్థాయిలో పర్యటించి లేక్ వ్యూ రెస్టారెంట్ ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో చెప్పిన సూచనలను పక్కన పడేశారు. మ్యూజికల్ గార్డెన్ పేరు నుంచి కొన్నేళ్లుగా మ్యూజికల్ అనే పదమే పోయింది. గార్డెన్‌లో మ్యూజికల్ ఫౌంటెన్ పని చేయకపోవడంతో అధికారులు దాన్ని తొలగించారు. పర్యాటకం నుంచి సంపద సృష్టించుకోవాలన్న ఆలోచనలను మరిచిన కుడా అధికారులు పనులను వేగం చేసి నగర ప్రజలకు మ్యూజికల్ గార్డెన్ అందుబాటులోకి తీసుకురావడంలో పూర్తిగా నిర్లిప్తంగా ఉంటున్నారు. ఇప్పటికైనా గార్డెన్‌ను పునరుద్ధరించి సంగీత ఝరీ వినిపించేలా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

భూ కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హనుమకొండ, నవంబర్ 18 : కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన దళిత రైతు అరూరి కుమారస్వామి భూమిని కబ్జా చేసిన ఎర్రబెల్లి ఉపేందర్ రావుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. భూ కబ్జాదారుడి నుంచి దళిత రైతు భూమిని కాపాడాలని, ఉపేందర్ రావుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో భూ బాధితుడు అరూరి కుమారస్వామి పాల్గొన్నారు.

దళారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న సుమన్

శాయంపేట, నవంబర్ 18 : శాయంపేటలో దళారులు పత్తి తూకంలో మోసాలకు పాల్పడుతూ రైతులను దోపిడీ చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ. 7,121 ధర నిర్ణయించిందని, కానీ శాయంపేటలో దళారులు రూ. 5,800 నుంచి 6,200 ధరతో పత్తి కొనుగోలు చేస్తూ వారిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కాంటా వేసే సమయంలో ప్రతి క్వింటాకు రెండు నుంచి ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారన్నారు. తక్షణమే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్చన

యాసంగిలో అధిక దిగుబడి సాధించాలి

దామెర, నవంబర్ 18 : మండలంలోని పులుకుర్తిలో వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతులకు యాసంగి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్చన మాట్లాడుతూ.. సాగులో రైతులు ఆధునిక మెళకువలు పాటించాలని, తెగుళ్ల నివారణలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి వెన్నెలకు సన్మానం

కాజీపేట, నవంబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సారథి, గద్దర్ కూతురు గుమ్మడి వెన్నెలను హైదరాబాద్‌లో గద్దర్ తొలితరం శిష్యులు సోమవారం సన్మానించారు. కొండ్ర నర్సింగరావు, గాజాల గోవర్ధన్, నాగేంద్రబాబు, గద్దర్ సాంబన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో హెచ్ఎం సుమాదేవి, పార్థసారథి

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

హసన్‌పర్తి, నవంబర్ 18 : హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సుస్మిత, లక్ష్మణ్, ఇషాక్ అండర్ –17 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం సుమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో హెచ్ఎంతో పాటు కోచ్ పార్థసారథి, అధ్యాపకులు అభినందించారు.

మహిళా శక్తి మేళా ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : ఆర్ట్స్ కాలేజీ ప్రాగణంలో సోమవారం సాయంత్రం మహిళా శక్తి మేళా ప్రారంభమైంది. సెర్ప్, మెప్మా ద్వారా 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌లో సుమారు 40 రకాల వివిధ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. స్టాల్స్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సోమవారం ప్రారంభించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద వారి వెంట ఉన్నారు. ఇందులో సెర్ప్ నుంచి 28, మెప్మా నుంచి 12 రకాల ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. జనగామ జిల్లాకు సంబంధించిన పెంబర్తి హస్తకళా వస్తువులు, నారాయణ్‌పేట్ నుంచి చీరలు, టెర్రకోట జువెలరీ, హ్యాండ్లూమ్స్, భూపాలపల్లి నుంచి దస్తి పట్టువస్తువులు, చేర్యాల నుంచి నగిషీ పెయింటింగ్స్, యాద్రాద్రి నుంచి పోచంపల్లి, ఇక్కత్ వస్త్రాలు.. ఇలా వివిధ జిల్లాల్లో గుర్తింపు పొందిన ఉత్పత్తులను ఈ స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టాళ్లను సందర్శించి మహిళా స్వయం సహాయక సంఘాలు, మండల, జిల్లా సమాఖ్య సభ్యులతో మాట్లాడనున్నారు.

ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి మేళా స్టాల్

ముసుగు తొలగేదెన్నడో?

కాజీపేట చౌరస్తాలో కవర్లు చుట్టి ఉన్న ప్రయాణికుల బొమ్మలు

- కాజీపేట చౌరస్తాలో బొమ్మల ఏర్పాటు
- కవర్లు చుట్టి.. ప్రారంభం మరిచారు..

కాజీపేట, నవంబర్ 17 : నగరానికి ముఖద్వారంగా ఉన్న కాజీపేట చౌరస్తాలో ఓ వైపు స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టిన సుందరీకరణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ప్రయాణికుల ఆకృతుల్లో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన విగ్రహాలకు కవర్లు చుట్టారు. కాజీపేట ముఖ్య కూడలి, రైల్వే స్టేషన్ వైపు కుడా, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సుందరీకరణ పనులను చేపట్టారు. చౌరస్తాలో విగ్రహాలను ఏర్పాటు చేసి, చుట్టూ విద్యుత్ లైటింగ్, పచ్చటి మొక్కలు, గడ్డిని పేర్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సమయంలో సుందరీకరణ పనులు ప్రారంభిస్తారని అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించారు. పనులు పూర్తయి ఐదు నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవం మాత్రం చేయలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పట్టణంలో తిరిగే చాల మంది భిక్షాటకులు, అనాథలకు రాత్రి వేళల్లో విశ్రాంతి అడ్డాగా మారిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పూర్తయిన పనులను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, నవంబర్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వరంగల్ నగరంలో మంగళవారం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వాహనాలు చింతగట్టు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కరుణాపురం మీదుగా వెళ్లాలి. ఖమ్మం నగరానికి ఐనవోలు, పున్నేలు మీదుగా, వర్ధన్నపేట నుంచి హైదరాబాద్, కరీంనగర్, ములుగు, పరకాలకు వాహనాలు పున్నేలు, కరుణాపురం, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

సభకు వచ్చే వాహనాల రూట్..

హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరుగనున్న సీఎం సభకు వచ్చే వాహనాలు నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని సీపీ సూచించారు. హుజూరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి ఉనికిచర్ల క్రాస్ రోడ్డు, వడ్డేపల్లి రోడ్డు ద్వారా సర్క్యూట్ హౌస్ రోడ్డులో జనాలను దింపి ఓల్డ్ బస్ డిపో వద్ద పార్కింగ్ చేయాలి. ములుగు, భూపాలపల్లి నుంచి వాహనాలు కేయూసీ రోడ్డు, గోపాలపూర్ జంక్షన్, హనుమకొండ తిరుమల బార్ జంక్షన్ నుంచి ఎక్సైజ్ కాలనీ ఐలాండ్ వద్ద ప్రజలను దింపి ఎక్సైజ్ కాలనీ రోడ్డు నంబర్–1లో నిలపాలి. నర్సంపేట నుంచి వచ్చే వాహనాలు చింతల్ బ్రిడ్జి మీదుగా హంటర్ రోడ్డు, నీలిమా జంక్షన్ మీదుగా తెలంగాణ జంక్షన్ వద్దకు చేరుకుని ప్రజలను దింపి అక్కడ సూచించిన ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. మామునూరు నుంచి వచ్చే వాహనాలు ఉర్సు గుట్ట సీఎస్ఆర్, హంటర్ రోడ్డు తెలంగాణ జంక్షన్ వద్ద ప్రజలను దింపి విష్ణుప్రియ గార్డెన్ వద్ద పార్కింగ్ చేయాలి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి వచ్చే వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి ఉనికిచర్ల క్రాస్ రోడ్డు ద్వారా వడ్డేపల్లి చర్చి మీదుగా ప్రశాంత్‌నగర్ ద్వారా ఏ టు జడ్ వద్ద ప్రజలను దింపి వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సీపీ డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేశారు. సభ పరిసర ప్రాంతాల్లో కఠినమైన ఆంక్షలు ఉంటాయన్నారు.

నిట్‌లో సదస్సును ప్రారంభిస్తున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, రాంకుమార్‌రెడ్డి

నిట్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హెల్త్‌కేర్ అప్లికేషన్స్'పై సదస్సు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హెల్త్‌కేర్ అప్లికేషన్స్' అనే అంశంపై ఒక వారం రెసిడెన్షియల్ షార్ట్–టర్మ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వరంగల్ కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, గౌరవ అతిథిగా ఐఐటీ హైదరాబాద్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్, మాజీ డీన్ ఆఫ్ పబ్లిక్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ హాజరయ్యారు. బీబీనగర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ రాధికా సోంకర్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్ -3 పరీక్ష

మొదటి రోజు 53 శాతం.. రెండో రోజు 52 శాతం అభ్యర్థుల హాజరు

హనుమకొండ, నవంబర్ 18 : జిల్లాలో నిర్వహించిన గ్రూప్ –3 పరీక్షకు రెండో రోజు హాజరైన అభ్యర్థుల సంఖ్య తగ్గింది. మొదటి రోజు రెండు సెషన్లలో 53 శాతం కాగా, సోమవారం నిర్వహించిన పరీక్షకు కేవలం 52.62 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లాలో 83 సెంటర్లలో 32,864 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా, కేవలం 17,292 మంది మాత్రమే హాజరైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కాగా, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సావాల్లో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రిటైర్డ్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాదించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కవి సిరాజొద్దీన్ మాట్లాడుతూ.. కవులు సమాజానికి అవసరం అని అన్నారు. సంస్థ కార్యదర్శి శశిజాదేవి మాట్లాడుతూ.. గ్రంథాలయాల చైతన్యానికి కవుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. గ్రేడ్–2 లైబ్రేరియన్ మన్సూర్, గ్రేడ్–3 లైబ్రేరియన్ పురుషోత్తంరాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, టైపిస్ట్ కుమార్‌స్వామి, కొండయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా నిలవాలి

డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి క్షమ దేశ్‌పాండే

హనుమకొండ, నవంబర్ 18 : ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి క్షమ దేశ్‌పాండే అన్నారు. సోమవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చైల్డ్ రైట్స్ వీక్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లలకు హక్కులపై అవగాహన కల్పించారు. మానసిక దివ్యాంగ చిన్నారులకు ఎలాంటి అవసరాలున్నా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. వారి గుర్తింపు కార్డులు, పెన్షన్ కార్డుల ప్రక్రియ సులభతరం చేసేందుకు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులకు డీఎల్ఎస్ఏ తరపున లెటర్ పెడతామన్నారు. కార్యక్రమంలో స్పందన స్కూల్ నిర్వాహకులు సుచరితారెడ్డి, బన్ను స్కూల్ కిరణ్ కుమారి, వసుధ, అతిథి స్కూల్ సుజాత, వికాస్ స్కూల్ విశాలి, నవ్యశ్రీ స్కూల్ శ్రీకాంత్, ఆదర్శ స్కూల్ మణికంఠ, డాన్‌బాస్కో కోషి ఫాదర్, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న క్షమ దేశ్‌పాండే